విద్యార్థుల ఇంటిబాట

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రభుత్వం విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు గురువారం సాయంత్రం నుంచి ఆనందోత్సాహాలతో ఇంటిబాట పట్టారు. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పండుగపూట ఆనందంగా ఇంటికెళ్తున్నారు. గంభీరావుపేటలోని కేజీబీవీ నుంచి విద్యార్థినులను ఇంటికి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు వచ్చారు.



న్యూస్‌రీల్

బీజేపీ గద్దెకు కేసీఆర్ ముసుగు !

- వెక్కిరిస్తున్న ఎన్నికల కోడ్



బీజేపీ జెండా గద్దెకు ముసుగు ఇలా..

చందుర్తి(వేములవాడ): ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేస్తే.. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చందుర్తి మండల కేంద్రంలోని బీజేపీ జెండా గద్దెకు ముసుగుకు బదులు సీఎం కేసీఆర్ బొమ్మలతో ఉన్న ఓ పత్రిక ప్రతులను అతికించారు. ఈ విషయం గురువారం స్థానికంగా చర్చకు దారితీసింది. ఎన్నికల కోడ్ అమలుపై చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దాని తర్వాత క్షేత్రస్థాయి సిబ్బంది ఇలా వ్యవహరించడంపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. సిబ్బంది తీరుపై బీజేపీ నాయకులు మండిపడుతున్నారు.

'బతుకమ్మ' తెలంగాణ జీవనయానం

- బహుభాషావేత్త నలిమెల భాస్కర్



ఆవునూర్ పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, నలిమెల భాస్కర్

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ పల్లె పదానికి, నుడికారానికి నిలువెత్తు జీవన ప్రయాణానికి బతుకమ్మ నిలువుటద్దంలా నిలుస్తుందని బహుభాషావేత్త నలిమెల భాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న నలిమెల భాస్కర్ మాట్లాడారు. వేల ఏళ్ల చరిత్ర గల తెలంగాణం.. ప్రపంచ దేశాలకు మార్గదర్శి అన్నారు. తీరొక్క పూలతో రంగుల సింగిడిని చేర్చే తెలంగాణ ప్రజలు కష్ట, సుఖాలలో పాటలు పాడుకున్నారన్నారు. రంగినేని ట్రస్టు చైర్మన్ మోహన్‌రావు, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు యారన్ సబ్సిడీ చెల్లించాలి



మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ చెల్లించాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. బీవైనగర్‌లో యూనియన్ ఆఫీస్‌లో గురువారం మాట్లాడారు. 2021 నుంచి బతుకమ్మ చీరలకు సంబంధించి కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ అందించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారు. ఈనెల 5న చేనేత జౌళీశాఖ కార్యాలయం ముందు నిరసన చేపట్టగా, మూడు రోజుల్లో చెల్లిస్తామన్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా డబ్బులు జమ చేయకపోతే చేనేత జౌళీశాఖ కమిషనర్‌ను కలువనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, చంద్రకాంత్, సురేశ్, తిరుపతి పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో శ్వాస, హీమాన్షి ఆస్పత్రుల ఆధ్వర్యంలో గురువారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గుండె సంబంధిత అనుమానాలు, తదితర అంశాల గురించి వివరించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి చేయాల్సిన సీపీఆర్‌పై బెటాలియన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, వైద్యులు సురేంద్రబాబు, రాహుల్, నీలిమ, బెటాలియన్ అధికారులు పార్థసారధి, జేపీ నారాయణ పాల్గొన్నారు.

అతివలే నిర్ణేతలు !

'వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే మహారాణి.. కానీ గిన్నెలన్నింటిపైనా మా నాన్న పేరు'.. అంటూ.. పురుషాధిక్య సమాజాన్ని ప్రశ్నించారు ఓ కవయిత్రి.. కానీ ఎన్నికల వేళ ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే.. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ప్రస్తుతం జరిగే శాసనసభ ఎన్నికల్లో నిర్ణయాధికారం ఆమెదేనని స్పష్టమవుతుంది. అతివల ఓటే శాసనంగా మారి నేతల తలరాతలను మార్చనుంది. - సిరిసిల్ల



- అవకాశాల్లో సగం.. ఓటర్లుగా అధికం
- సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో స్త్రీల ఆధిక్యం
- 13,291 మంది మహిళా ఓటర్లు ఎక్కువ

ఐదేళ్ల కిందట కూడా 'ఆమె'దే పై చేయి

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 2018 నాటి ఓటర్ల జాబితాను పరిశీలిస్తే.. సిరిసిల్ల నియోజకవర్గంలో 3,934 మహిళా ఓట్లు అధికంగా ఉంటే.. ఈసారి 5,048 మంది ఉన్నారు. అంటే.. 1,114 మంది మహిళా ఓటర్లు పెరిగారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలో 2018లో 7,119 మహిళా ఓటర్లు అధికంగా ఉంటే.. ఈసారి 8,243 మంది ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ కూడా 1,124 మంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇలా రెండు నియోజకవర్గాల పరిధిలో 2,238 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

దివ్యాంగుల్లో పురుషులు అధికం

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో దివ్యాంగ ఓటర్లు 11,479 మంది ఉండగా.. సిరిసిల్ల పరిధిలో 5,669 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,322 మంది ఉండగా మహిళలు 2,347 మంది ఉన్నారు. మహిళల కంటే పురుషులు 975 మంది దివ్యాంగ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. అదే వేములవాడ పరిధిలో 5,810 మంది దివ్యాంగ ఓటర్లు ఉండగా... పురుషులు 3,181, మహిళలు 2,629 మంది ఉన్నారు. మహిళా దివ్యాంగుల కంటే పురుషులు 552 మంది ఎక్కువగా ఉన్నారు.

మహిళా ఓటర్ల చైతన్యం

ఎన్నికల రోజు కూడా పురుషుల కంటే మహిళా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఎక్కువ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. ఎన్నికల్లో పట్టణాలు, పల్లెలు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ మహిళా చైతన్యం వెల్లివిరుస్తుంది. ఎక్కువ సేపు క్యూలైన్‌లో నిలబడి ఓపికగా ఓటు వేయడం విశేషం. దీంతో ప్రతి ఎన్నికల ఫలితాల్లోనూ మహిళా ఓటర్లు ప్రభావితం చేస్తున్నారు. పెరిగిన మహిళా ఓటర్లు, పెరగనున్న ఓటింగ్‌శాతంతో అతివలే నిర్ణేతలుగా నిలువనున్నారు. నేతల తలరాతలను మార్చే శక్తిగా మహిళాశక్తి మారనుంది.

సిరిసిల్ల నియోజకవర్గ ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు	2,27,833
మహిళలు	1,22,920
పురుషులు	1,17,872
థర్డ్ జెండర్	06
సర్వీసు ఓటర్లు	106
పురుషుల కంటే మహిళా ఓట్లు ఎక్కువ	5,048

వేములవాడ నియోజకవర్గంలో..

మొత్తం ఓటర్లు	2,18,160
మహిళలు	1,13,186
పురుషులు	1,04,943
థర్డ్ జెండర్ ఓట్లు	31
సర్వీసు ఓట్లు	52
పురుషుల కంటే మహిళా ఓట్లు ఎక్కువ	8,273

ప్రచార సామగ్రి ముద్రణలో నిబంధనలు పాటించాలి

- నిర్లక్ష్యం చేస్తే జైలుశిక్ష
- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి



అనురాగ్ జయంతి, జిల్లా ఎన్నికల అధికారి

సిరిసిల్ల: జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల ప్రచార సామగ్రి ముద్రణలో నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం వివరాలు వెల్లడించారు. కరపత్రాలు, పోస్టర్లు, నమూనా బ్యాలెట్ పత్రాలు ముద్రించినా దానిపై ప్రచురణకర్త పేరు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రింట్‌చేసిన మూడు రోజుల్లో ప్రచురణకర్త నుంచి పొందిన డిక్లరేషన్‌తో సహా జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌కు బై.. కాంగ్రెస్‌కు జై

- ఎంపీపీ వెంకటరమణారెడ్డితో పాటు పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న ఇల్లంతకుంట నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగినవేళ ఇల్లంతకుంట మండలంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అధికార బీఆర్ఎస్‌కు పలువురు నాయకులు గురువారం షాక్ ఇచ్చి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఇల్లంతకుంట ఎంపీపీ ఊట్కూరు వెంకట రమణారెడ్డి, వెల్జీపూర్ మాజీ సర్పంచ్ గుండా వెంకటేశం, సింగిల్‌విండో డైరెక్టర్ జంగిటి కొమురయ్యతోపాటు పలువురు నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకముందు ఇల్లంతకుంట ఎంపీపీ వెంకట రమణారెడ్డి బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు రాజీనామా లేఖను పంపారు. ఒక ఎంపీపీ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడంతో స్థానికంగా రాజకీయ దుమారం చెలరేగింది.

పోలీసుల తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత



పట్టుకున్న నగదు

గంభీరావుపేట(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం రూ.లక్ష నగదును పట్టుకున్నారు. కామారెడ్డి నుంచి కరీంనగర్ వెళ్తున్న ఓ కారును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా రూ.లక్ష నగదు పట్టుబడింది. ఆ నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అప్పగించనున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



జిల్లా సరిహద్దు వెంకట్రావుపల్లె వద్ద పోలీసుల తనిఖీలు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లా సరిహద్దు మండలంలోని వెంకట్రావుపల్లెలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. సిద్దిపేట, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోకి వచ్చి, పోయే వాహనాలను తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.50వేలకు మించి నగదును కలిగి ఉంటే సరైన ఆధారాలు చూపాలన్నారు. చీరలు, ఇతర వస్తువులను పెద్ద మొత్తంలో తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ ఇన్‌చార్జీల నియామకం

ప్రచార జోరు పెంచిన కారు



బి.వినోద్‌కుమార్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ దూసుకుపోతోంది. గులాబీ బాస్ సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభల షెడ్యూల్ విడుదలైంది. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ తరఫున ఇన్‌చార్జీలను నియమించారు. ఇతర పార్టీలు టిక్కెట్లు ఖరారు చేయడంలో తర్జనభర్జన పడుతుంటే.. గులాబీ పార్టీ ఈనెల 15న అభ్యర్థులకు బీఫాంలను అందజేయనుంది. బీఆర్ఎస్ అధినేత రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఇలా అన్ని విషయాల్లో ప్రత్యర్థి పార్టీలకు అందుకోలేనంత స్పీడ్‌గా ప్రచారంలో కారు జోరు పెంచింది.

గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం

అసెంబ్లీ ఎన్నికలకు నెలల సమయమున్నా సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించటంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారైన మరుసటి రోజు నుంచే వారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గెలుపు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ తమను మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మధ్య గ్యాప్ లేకుండా జిల్లాలోని 7 నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించారు.

అసెంబ్లీ ఇన్‌చార్జీలు వీరే..

చొప్పదండి	గంగుల కమలాకర్
వేములవాడ	బి.వినోద్‌కుమార్
మానుకొండూర్	జీవీ రామకృష్ణారావు
పెద్దపల్లి	రవీందర్‌సింగ్
మంథని	ఈద శంకర్‌రెడ్డి
రామగుండం	నారాదాసు లక్ష్మణరావు
జగిత్యాల	ఎల్.రమణ, రాజేశంగౌడ్

దేవీ నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

- 15 నుంచి 23 వరకు వేడుకలు
- రాజన్న ఆలయంలో ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు సిద్ధమవుతున్న మండపం

వేములవాడ: ఈనెల 15 నుంచి 23 వరకు జరిగే దేవీ నవరాత్రోత్సవాలకు రాజన్న ఆలయంలో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. గురువారం ప్రత్యేక ఏర్పాట్లు, తాత్కాలిక మండపం, హోమగుండాలు సిద్ధం చేసి ఉంచారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్




ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు ఉద్యమాలు చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులేనని.. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం చింతల్‌ఠాణాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు ఆరు గ్యారంటీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్‌మానేరు నిర్వాసితులకు ఉపాధి కోసం పరిశ్రమలు, ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితులు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉన్నామన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, సర్పంచులు కదిరె రాజుకుమార్, పండుగ ప్రదీప్, ఎంపీటీసీ బస రాజశేఖర్, కనకయ్య, పర్శరాములు, దేవరాజు, శ్రీనివాస్, గురువయ్య, భారతి ఉన్నారు.

ఇంటింటా ప్రచారం

వేములవాడ: నాలుగుసార్లు ఓడిపోయినా ఈ ప్రాంత ప్రజలను వదిలి వెళ్లలేదని, కష్టసుఖాల్లో వెంటున్నానని తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. స్థానిక మహాలక్ష్మీవీధి, బైపాస్‌రోడ్డు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులతో కలసి ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, సంగ స్వామియాదవ్, కూరగాయల కొమురయ్య, తూం మధు, కనికరపు రాకేశ్, నాగుల విష్ణు, వస్తాద్ కృష్ణ, నాగుల రాము, తోట లహరి, నూగురి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం ఆర్యవైశ్య మహిళలు బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు బతుకమ్మ పండుగకు ముందు బొడ్డెమ్మతో వేడుకలు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది బతుకమ్మ పండుగకు బొడ్డెమ్మతో శ్రీకారం చుట్టారు. వేడుకల్లో బొమ్మకంటి జ్యోతి, బచ్చు విజయ, కవిత, గంప లలిత, బుస్స కవిత, సంధ్య, సాధన, సాగరిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నిరుపేదకు 'గృహలక్ష్మి'



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- మూడేళ్లలోనే నియోజకవర్గ అభివృద్ధి
- బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడరూరల్: గెలిచిన ఏడాదిలోపే నియోజకవర్గంలో నిరుపేదలకు గృహలక్ష్మి కింద ఇల్లు నిర్మించి ఇస్తామని, ఈ నియోజకవర్గానికి ఎన్ని కోట్లయినా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిలో గురువారం ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం వేములవాడరూరల్ అధ్యక్షుడు గోస్కుల రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్న తనకు ఈ ప్రాంతానికి సేవ చేసే భాగ్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కల్పించారన్నారు. తాను గెలిచిన మూడేళ్లలోపు కనీవినీ ఎరుగని రీతిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ ప్రాంత వాసిని కాదని కొందరు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ గడ్డ మీద జన్మించిన వాడినేనని గుర్తుచేశారు. ఆరు పథకాలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయడానికి వస్తుందన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, గడ్డం హన్మాండ్లు, ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ఏ నుగు తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఎంపీటీసీ వెలుమ నర్సవ్వ, కట్కం మల్లేశం హాజరయ్యారు.

రుద్రంగిని అభివృద్ధిని చేస్తా

వేములవాడ: రుద్రంగి మండలంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. వేములవాడలో గురువారం రుద్రంగికి చెందిన పలువురు యువకులతో సమావేశమయ్యారు. తనపై ప్రతిపక్ష నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని.. వాటిని తాను లెక్కచేయబోనన్నారు. తాను మల్కపేట బిడ్డనని.. ఈ ప్రాంతంలోని సమస్యలు తెలుసునని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీ బండ మల్లేశం, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీపీ గంగం స్వరూపరాణి, సెస్ డైరెక్టర్ గంగారాం, పార్టీ మండలాధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

అన్నా.. రూ.50 వేలు ఇప్పియ్యరాదే..!

- 'డబుల్' లబ్ధిదారునితో ఓ ప్రజాప్రతినిధి
- చర్చనీయాంశమైన సంభాషణ

గంభీరావుపేట(సిరిసిల్ల): 'అన్నా.. అత్యవసరం ఉందే.. ఓ రూ.50వేలు ఇప్పియ్యరాదే..' అంటూ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారునితో ఓ ప్రజాప్రతినిధి అభ్యర్థన. నేనే నిరుపేదను పైసలిప్పిచ్చే స్థాయిలో ఉన్నానా అన్నా..' అంటూ లబ్ధిదారుని ఆవేదన. ఇది ఫోన్‌లో జరిగిన సంభాషణ స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ తరహాలో పలువురు నాయకులు తమకు తోచిన రీతిలో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసే పనిలో పడ్డట్లు ప్రచారంలో ఉంది. గంభీరావుపేట మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలోనే లబ్ధిదారులుగా ఎంపికైన వారి నుంచి అందినకాడికి దండుకోవాలనే ఆలోచనలో పలువురు నాయకులు ప్రయత్నిస్తున్నారు. తాజాగా గంభీరావుపేటకు చెందిన ఓ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారునికి, ఓ ప్రజాప్రతినిధికి మధ్య ఫోన్ సంభాషణ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అర్హులను విస్మరించి అనర్హులకు ఇళ్లు కేటాయించారని, రీసర్వే చేయాలని, అర్హులకు న్యాయం చేయాలని పలువురు అధికారులకు నిత్యం విన్నవిస్తున్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు యాదవ సంఘం మద్దతు



జెడ్పీటీసీ సమక్షంలో మద్దతు ప్రకటిస్తున్న యాదవ సంఘం సభ్యులు

గంభీరావుపేట(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్లు మండలంలోని గోరింటాలకు చెందిన యాదవ సంఘం నాయకులు ప్రకటించారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ సమక్షంలో తమ మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి కేటీఆర్‌కే ఉంటుందని ప్రకటించారు. యాదవుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషిని గుర్తు చేశారు. సర్పంచ్ కొలుముల అంజమ్మ, ఎంపీటీసీ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు నరేందర్, నాయకులు లక్ష్మణ్, బాల్‌రెడ్డి, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి ఓపెన్‌స్కూల్ పరీక్షలు

సిరిసిల్లఎడ్యుకేషన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో విద్యనభ్యసించే అభ్యర్థులకు ఈనెల 16 నుంచి పరీక్షల నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. పది, ఇంటర్ విద్యార్థులకు ఈనెల 26 వరకు పరీక్షలుంటాయని, జిల్లా వ్యాప్తంగా 223 మంది విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. స్థానిక శివనగర్ పాఠశాలతోపాటు వెంకంపేట పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రవేశం పొందిన అధ్యయన కేంద్రానికి వెళ్లి హాల్‌టికెట్ తీసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతి



చెక్కు అందిస్తున్న మహిళా సంక్షేమశాఖ సిబ్బంది

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని పెద్దబజార్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా రమ గురువారం గుండెపోటుతో మృతిచెందింది. అంత్యక్రియల కోసం రూ.10వేల చెక్కును సీడీపీవో ఆనందిని అందజేశారు.

వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో రాములు మాట్లాడారు. మున్సిపల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న నారాయణ అనే కార్మికుడు గత పది నెలలుగా వేతనాలు రాక ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం బాధాకరమన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా వారిని వేధించడం సరికాదన్నారు. నాయకులు సమాల మల్లేశం, నల్ల చంద్రమోళి, అజ్జ వేణు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలందక అవస్థలు

- సస్పెన్షన్‌లో ఐదు ఆధార్ సెంటర్లు
- ఆధార్ నమోదు, అప్‌డేట్‌కు ఇబ్బంది
- నాలుగు మండలాల్లో తిప్పలు



ఆధార్ సెంటర్‌లో ప్రజలు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి):ఇప్పుడు ఆధార్‌కార్డు సర్వరోగ నివారిణిగా మారింది. బ్యాంక్ ఖాతా నుంచి మొదలుపెడితే పెన్షన్ డబ్బులు.. రేషన్ సరుకులు తీసుకునే దాకా ఆధార్‌కార్డు తప్పనిసరి. ఇటీవల ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని చెబుతుండడంతో ప్రజలు కేంద్రాలకు బారులు తీరుతున్నారు. జిల్లాలోని నాలుగు మండలాలు బోయినపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేటల్లో ఒక్కో కేంద్రం, గంభీరావుపేటలో రెండు సెంటర్లను సస్పెండ్ చేశారు. కోనరావుపేట మండలంలో రెండేళ్లుగా ఆధార్‌సెంటర్ మూతపడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోయినపల్లి మండలంలోనూ కొద్ది నెలలుగా ఆధార్‌సెంటర్ మూతపడింది.

జిల్లాలో 30 వరకు కేంద్రాలు..

జిల్లాలో సుమారు 30 వరకు ఆధార్ కేంద్రాలు ఉంటే.. తప్పుడు సమాచారం ఎంట్రీ చేశారని కోనరావుపేట, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలో రెండు ఆధార్ సెంటర్లు సస్పెండ్ అయినట్లు టీఎస్‌టీఎస్ జిల్లా అధికారి చెప్పారు. ఆధార్ కేంద్రంలో తప్పుడు డాక్యుమెంట్లు చూపడం, ఏదో ఒక ఆధారం చూపి పుట్టిన తేదీ మార్చడం, వయస్సు మార్చడం, ఇంటి పేరు, ఇతర చిరునామాలు ఏదో ఒక సర్టిఫికెట్ చూపి మార్చడం సమస్యగా మారిందని తెలిపారు. దరఖాస్తుదారులు తెచ్చే వివిధ సర్టిఫికెట్లు ఒరిజినలా? డూప్లికేటా? తెలియదని నిర్వాహకులు చెబుతున్నారు. ఇలా ఆధార్‌సెంటర్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత డీవో 1 ఎర్రర్ అని రావడంతో సెంటర్లు సస్పెండ్ అవుతున్నాయని చెబుతున్నారు.

ఆధార్ సేవలు అందక ఇబ్బందులు

ఆధార్ సెంటర్లు సస్పెండ్ అయిన మండలాల్లో ఆధార్ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో సెంటర్ మాత్రమే ఉన్న బోయినపల్లి, కోనరావుపేట మండలాల ప్రజల బాధలు వర్ణనాతీతం. బోయినపల్లి మండలంలో 23 గ్రామాలకు మండల కేంద్రంలో ఒక్క ఆధార్ కేంద్రం మాత్రమే ఉంది. అది సస్పెండ్ కావడంతో ప్రజలు గంగాధర, వేములవాడ మండలాలకు వెళ్లి ఖర్చుతోపాటు కష్టాలు పడుతున్నారు. జిల్లాలో మూతపడ్డ ఆధార్‌సెంటర్లు తెరుచుకోవడానికి మంత్రి కేటీఆర్ కృషి చేస్తున్నట్లు సమాచారం. త్వరగా ఆధార్‌సెంటర్లు తెరవాలని మంత్రి కేటీఆర్ ఈఎస్‌డీకి చెప్పినట్లు సమాచారం.

ఆధార్ కేంద్రం లేక ఇబ్బంది



బోయినపల్లిలో ఒకటే ఆధార్ కేంద్రం ఉంది. ఉన్న ఒక్క ఆధార్ సెంటర్ సస్పెండ్ కావడంతో మండలంలోని 23 గ్రామాల ప్రజలు ఆధార్ సేవలకు అరిగోస పడుతున్నారు. వ్యయప్రయాసాల కోర్చి గంగాధర, వేములవాడ మండలాలకు వెళ్లి ఆధార్ సేవలు పొందుతున్నారు. బోయినపల్లిలో వెంటనే సెంటర్ ప్రారంభించాలి.

– కొనుకటి హరీశ్, నీలోజిపల్లి

వేములవాడలో రోజంతా ఉన్నా..



ఆరోగ్యశ్రీ కార్డు కేవైసీ చేసుకోవాల్సి ఉంది. దీనికి సెల్‌ఫోన్ నంబర్ ఆధార్‌తో అనుసంధానించుకోవాలి. బోయినపల్లిలో సెంటర్ మూతపడింది. వేములవాడ వెళ్లి రోజంతా ఉండి మొబైల్ నంబర్ నమోదు చేయించుకున్నాను. ఆధార్ సెంటర్ లేకపోవడంతో చాలా మంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా ఆధార్‌సెంటర్లు ప్రారంభించి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

– బాలగోని శ్రీకాంత్, బోయినపల్లి

త్వరలో ప్రారంభిస్తాం



బోయినపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటల్లోని ఐదు కేంద్రాలు సస్పెండ్ అయ్యాయి. వాటిని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మంత్రి కేటీఆర్ సైతం ఈఎస్‌డీకి ఫైల్ పెట్టారు. త్వరలో ఆధార్‌సెంటర్లు ప్రారంభించేందుకు ఉన్నతాధికారులకు తెలిపాం.

– మహేశ్, టీఎస్ టీఎస్, జిల్లా మేనేజర్

సీఎం సభ చరిత్రలో నిలవాలి

- అభివృద్ధి ప్రదాతకు ఆశీర్వాదం ఇవ్వాలి
- ఎమ్మెల్సీ ఎల్.రమణ
- సభాస్థలిని పరిశీలించిన బీఆర్‌ఎస్ నేతలు



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రమణ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగసభ చరిత్రలో నిలిచిపోవాలని ఎమ్మెల్సీ ఎనగందుల రమణ పేర్కొన్నారు. సిరిసిల్ల మొదటిబైపాస్ రోడ్డులో సీఎం కేసీఆర్ బహిరంగ సభాస్థలిని గురువారం పరిశీలించారు. రమణ మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంతాన్ని జిల్లాగా మార్చి మల్కపేట రిజర్వాయర్ ద్వారా సాగునీటిని సాధించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. 2009 నుంచి సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్‌కు భారీ మెజార్టీని కట్టబెడుతున్న ఈ ప్రాంత ఓటర్లు మరోసారి బహిరంగసభకు తరలివచ్చి కేటీఆర్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకోవాలని కోరారు. నేతకార్మికులు, వస్త్ర పరిశ్రమ యావత్తు సభకు తరలిరావాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్ సిరిసిల్లకు వస్తున్న సందర్భంగా ఇంటికి తాళం వేసి.. అందరూ సభకు తరలిరావాలని కోరారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు కుంభాల మల్లారెడ్డి, బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజుయాదవ్, సత్తార్, మ్యాన రవి, అడ్డగట్ల మురళి, రాపెల్లి దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ న్యాయవాది రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): న్యాయవాదిని అని అబద్ధం చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని తంగళ్లపల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. మండలానికి చెందిన గొర్రె సుగుణాకర్‌కు సంబంధించిన భూమి తగాదాను పరిష్కరిస్తానని బీవై నగర్‌కు చెందిని బిజిలీ పర్శరాములు న్యాయవాదిగా పరిచయం చేసుకున్నాడు. సమస్యను పరిష్కరిస్తానంటూ రూ.లక్ష వసూలు చేసి మోసం చేశాడు. బాధితుడు సుగుణాకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి బిజిలీ పర్శరాములును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

14 తులాల బంగారం చోరీ



పోలీసులతో మాట్లాడుతున్న బాధితురాలు

కామారెడ్డిక్రైం: కామారెడ్డి బస్టాండ్‌లో దొంగలు రెచ్చిపోతున్నారు. ఓ మహిళా బ్యాగులో ఉన్న 14 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సిరిసిల్లకు చెందిన నాంపల్లి లక్ష్మి కామారెడ్డికి వచ్చి తిరిగి వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌కు వచ్చింది. వాటర్‌బాటిల్ కొనేందుకు ఓ దుకాణం వద్దకు వెళ్లింది. బాటిల్ కొనేలోపు పక్కనే ఉంచిన బ్యాగు చోరీకి గురైంది. అందులో 14 తులాల బంగారం ఉన్నట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే మరో ప్రయాణికుడి జేబులో నుంచి రూ.10వేల వరకు దొంగలు చోరీ చేసినట్లు అక్కడ ఉన్నవారు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడ్డ రాంరెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌లో ఇసుక ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో పాతూరి రాంరెడ్డి(38) తీవ్రంగా గాయపడ్డాడు. ఆవునూర్ మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా అతి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాంరెడ్డి కుడికాలు విరిగిపోగా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

ముగ్గురు బాలికలపై వృద్ధుడి లైంగికదాడి

గొల్లపల్లి(ధర్మపురి): ముగ్గురు బాలికలపై ఓ వృద్ధుడు మూడు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన మండలంలోని తిర్మాలాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. తాత అని పిలిచిన వారికి డబ్బు ఆశ చూపి.. మాయమాటలు చెప్పి ఈ ఆకృత్యానికి ఒడిగడుతున్నాడు. పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో వారి తల్లులు మందలించగా.. అసలు విషయం బయటపడింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు రంగధాముని పల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకరు ఐదు, మరొకరు నాలుగు, ఇంకొకరు మూడో తరగతి చదువుతున్నారు. ముగ్గురి తండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. తల్లులు కూలి పనిచేస్తూ వీరిని పోషించుకుంటున్నారు. వీరి సామాజికవర్గానికే చెందిన శివరాత్రి ముత్తయ్య(65) వీరి ఇంటి సమీపంలో ఉంటాడు. పిల్లలకు సెలవు రోజు ఇంటికి పిలిచి డబ్బులు ఇవ్వడంతోపాటు పొలం వద్దకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడుతున్నాడు. ఇలా మూడునెలలుగా తన కామవాంఛ తీర్చుకుంటున్నాడు. ఈక్రమంలో చిన్నారులు నాలుగురోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. తల్లులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని వారితో చెప్పారు. సదరు కామాంధుడిని కుల సంఘంలోకి పిలిస్తే రాకపోగా.. బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుల తల్లులు అంటున్నారు. దీంతో చేసేది లేక వారు గొల్లపల్లి పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

అడిగితే బెదిరింపులు

తమ పిల్లలకు జరిగిన అన్యాయంపై సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. కుల పెద్దలు పిలిచినా ముత్తయ్య రాలేదని, పైగా ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్ తమనే బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

ఉరి తీయాలి

తమ పిల్లల జీవితాలను నాశనం చేసిన ముత్తయ్యను ఉరితీయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి నిందితుడితోపాటు ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సదరు నిందితుడిని ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



సుశీలను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి గౌతమినగర్ రైల్వే గేట్ వద్ద గురువారం మెండే సుశీలను లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు.. సుశీల, ఆమె భర్త మెండే సంతోష్ గురువారం గోదావరిఖని నుంచి గౌతమినగర్ మీదుగా పెంచికలపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. లారీ టైర్ కింద పడడంతో సుశీల కుడిచేయి, నడుముకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. మండలంలోని నారాయణపూర్, బండలింగంపల్లి, సింగారం, కోరుట్లపేట, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహక సమావేశాలకు హాజరయ్యారు. ఈనెల 17న జిల్లాకేంద్రంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలించేందుకు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆగయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసింది శూన్యమన్నారు. ఆ పార్టీలు గ్రామాలకు వచ్చి ఓట్లు అడిగితే నిలదీయాలన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, సర్పంచులు నిమ్మ లక్ష్మి, కొత్తపల్లి వాణి, కొండపురం బాల్‌రెడ్డి, నర్సాగౌడ్, నాయకులు అందె సుభాష్, కొండ రమేశ్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, నర్సాగౌడ్, నర్సింలు, నిమ్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ వాహనం

కొండపాక(గజ్వేల్): పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌లాల్‌కు తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్ హైదరాబాద్ నుంచి రామగుండం వైపునకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. వారి వాహనానికి ముందు వెళ్తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై ఉన్న చిన్నకిష్టాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా తిరిగింది. దీంతో అడిషనల్ కలెక్టర్ వాహన డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బుడగ జంగాలను గుర్తించండి



అభివాదం చేస్తున్న బుడగజంగాల నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బుడగ జంగాలను ఏ ప్రభుత్వం గుర్తించడం లేదని, ఏ కులానికి చెందిన వారో తెలియని పరిస్థితి నెలకొందని, తమ జాతిని గుర్తించి న్యాయం చేయాలని బుడగ జంగాల జిల్లా అధ్యక్షుడు చల్ల బాల్‌రాజ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం సమావేశమయ్యారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే బుడగజంగాల్లో చైతన్యం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం గుర్తించి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా విబూది హన్మంతు, ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య, పర్శరాములు, కనకయ్య, కోశాధికారిగా పత్తిరి బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా మోతి తిరుపతి, ముఖ్య సలహాదారులుగా బొమ్మల మల్లేశం, మైసయ్య, కిరణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రవీందర్, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ దళితబంధు ఇవ్వండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దళితబంధు పథకాన్ని దళితులందరికీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రొడ్డ రామచంద్రం డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలో దళితబంధు పథకం కింద పదిరలో కేవలం 18 కుటుంబాలకు మాత్రమే ఇచ్చి.. అందరూ బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేస్తామని చెప్పించుకోవడం విడ్డూరమన్నారు. పక్కనే ఉన్న హరిదాస్‌నగర్‌లో 25 కుటుంబాలు ఉన్న వారిలో ఒక్కరికి కూడా దళితబంధు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళితులను ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పడం అన్యాయమని పేర్కొన్నారు. ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సూడిద రాజేందర్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్



అరెస్టు చూపుతున్న ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిషేధిత గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. గురువారం మీడియా ఎదుట నిందితుల అరెస్టు చూపారు. ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ గంజాయి అక్రమంగా సరఫరా చేస్తున్నారనే సమాచారంతో అనంతారం రోడ్డులో కేడీసీసీబీ వద్ద వహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. రూ.లక్ష విలువ చేసే నాలుగు కిలోల ఎండు గంజాయి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్స్ ఫసియొద్దీన్, దేవేందర్‌రెడ్డి, భూమయ్య, కానిస్టేబుల్స్ తిరుపతి, మధు, అనిల్, లక్ష్మీనారాయణ, బానుచందర్‌లను ఎస్సై అభినందించారు.

పేదల కడుపు నింపిన ‘ధరణి’



ఆహారం పంచుతున్న ధరణి సంస్థ సభ్యులు

సిరిసిల్లకల్చరల్: అన్నార్థుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న ధరణి స్వచ్ఛంద సంస్థ గురువారం పట్టణంలోని 200 మంది నిరుపేదలకు ఆహారం పంచి పెట్టింది. నాంపెల్లి సమీపంలోని సంకెపెల్లిలో కాశం అక్షయ్ ఇంట్లో ఓ శుభకార్యం కోసం చేయించిన ఆహార పదార్థాలు మిగిలిపోగా.. నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ధరణి సభ్యులు మిగిలిన ఆహారాన్ని సేకరించి, పట్టణంలోని కార్మికులు నివసించే తారకరామానగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో ఆహార పదార్థాలు, స్వీట్లు పంచిపెట్టారు. ధరణి నిర్వాహకురాలు కట్ట వింధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కత్తిపోట్ల కలకలం

గోదావరిఖని(రామగుండం): స్థానిక ప్రధాన చౌరస్తా వద్ద కత్తిపోట్లు కలకలం రేపింది. గురువారం రాత్రి చౌరస్తా సమీపంలోని గ్లోరిష్ ఫ్లవర్ మర్చంట్ వద్ద గొడవ జరిగింది. స్థానికుల వివరాలు.. ఎంగిలిపూల బతుకమ్మ సామగ్రి విక్రయించుకునేందుకు బల్లలు వేసుకునే విషయంలో గొడవ జరిగి పూలషాప్‌లో ఉన్న కత్తెరతో సతీశ్ అనే వ్యక్తి షాపులో పనిచేస్తున్న తుంగపిండి కార్తీక్, తుంగపిండి అర్జున్‌పై దాడి చేశాడు. దీంతో వారికి కడుపులో, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితులు పరుగెత్తుకుని వచ్చి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం



రాకేశ్‌పటేల్ మృతదేహం

రామగుండం: బసంత్‌నగర్ రైల్వే వంతెన వద్ద లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సింగరేణి ఉద్యోగి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాంపూర్ 1కే-1ఏలో బదిలీ వర్కర్‌గా పని చేస్తున్న చాతకొండ రాకేశ్‌పటేల్ గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వస్తుండగా లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ప్రధాన రహదారిపై జరిగిన ఈ ఘటనతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.